క్లుప్తంగా

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

కాజులూరు: పారిశుధ్య నిర్వహణపై సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ ఐ.రత్నంరాజు అన్నారు. బుధవారం కాజులూరులో ఎంపీడీఓ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటుచేసి పారిశుధ్య నిర్వహణ, జగనన్న స్వచ్ఛసంకల్పం పథకంపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం సచివాలయాలకు అవసరమైన పారిశుధ్య రిక్షాలను, తడి, పొడి చెత్త సేకరణకు టబ్‌లు పంపిణీ చేసిందన్నారు. ప్రజలు వీధుల్లో చెత్త పారవేయకుండా తడి, పొడి చెత్తను వేరుచేసి పారిశుధ్య కార్మికులు తీసుకువెళ్లే రిక్షాల్లో వేసేలా కార్యదర్శులు కృషి చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులు సేకరించిన తడి, పొడి చెత్తను సంపద కేంద్రాలకు తరలించటం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు.

వరిసాగులో నాట్ల దశే కీలకం

కాజులూరు: వరి సాగులో నాట్లు దశ కీలకమైనదని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. బుధవారం మండలంలోని గొల్లపాలెం, చేదువాడ తదితర గ్రామాల్లో ఏఓ పర్యటించారు. గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ నాట్లు వేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా పొలంలో చదరపు మీటరుకు 33 మూనలు ఉండేలా చూడాలన్నారు. పైపైనే నాట్లు వేయాలని, కుదురుకు రెండు నుంచి మూడు మొక్కలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాటే ముందు వరి మొక్క సుతలను తుంచి నాటాలని దీనివల్ల ఆకు సుతల్లో ఉండే హిస్స, కాండం తొలచు పురుగుగుడ్లు ప్రధాన పంటకు సోకకుండా జాగ్రత్త తీసుకున్నట్లు అవుతుందన్నారు. వీఏఏలు శిరీషా, రమ్య పలువురు రైతులు పాల్గొన్నారు.

విద్యాబోధనలో మెళకువలు పాటించాలి



పదోతరగతి విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రత్యేకాధికారులు

కె.గంగవరం: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా బోధనలో కూడా మార్పు రావాలని, వినూత్నంగా మెళకువలు పాటించి బోధన చేయాలని ప్రత్యేకాధికారులు రామచంద్రపురం ఎంఈఓ వి.నాగేశ్వరి, జీహెచ్‌ఎం అంబేడ్కర్ సూచించారు. మండలంలోని కె.గంగవరం, పామర్రు ఉన్నత పాఠశాలలను బుధవారం వారు తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల డైరీలు, లెసన్ ప్లాన్స్, బోధనోపకరణాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి ఆహార పదార్థాలను రుచి చూసి శుభ్రంగా విద్యార్థులకు వండి వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. హెచ్‌ఎంలు పి.వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేదల విద్యకు అధిక ప్రాధాన్యం



విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పేద విద్యార్థులకు అన్ని విధాల తోడ్పాటును అందించడం ద్వారా వారి ఉన్నతికి బాటలు వేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాటుపడుతున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ఎస్‌వీఎస్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌లను బుధవారం చైర్‌పర్సన్ దుర్గారాణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ పౌరులుగా తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. హెచ్‌ఎంలు మందేశ్వరరావు, ఆర్ నాగకుమార్, ఆర్టీసీ ఉద్యోగులు కుమార్, సూరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాపారాయుడుకు ఎమ్మెల్సీ పరామర్శ



పాపారాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్

మండపేట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయం నుంచి కోలుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడుని బుధవారం ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ పరామర్శించారు. అర్తమూరులోని ఆయన నివాసానికి వచ్చి పాపారాయుడును యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని అనంతబాబు ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు తోట రాజేశ్వరరావు, కిమ్మూరి వీర్రాజు తదితరులు ఉన్నారు.

గృహమస్తు

- సొంతింటి కల సాకారం
- పేద బతుకులకు ఏర్పడిన నీడ
- ఒక్కో ఇంటి విలువ రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

మండపేట: పేదల సొంతింటి కలను సాకారమైంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో ప్రభుత్వం ఇళ్ల స్థలం మంజూరు పేదలకు నీడ కల్పించింది. మండపేట పట్టణ, మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ద్వారపూడి శివారు వేములపల్లిలో ప్రభుత్వం 130 ఎకరాలు సేకరించి 6,518 మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. వీరిలో పట్టణానికి సంబంధించి 2013 మంది లబ్ధిదారులు ఉండగా రూరల్ పరిధిలో 4,505 మంది ఉన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇదే అతిపెద్ద లేఅవుట్. ప్రైవేట్ లే అవుట్లకు ధీటుగా జగనన్న కాలనీ లే అవుట్లను తీర్చిదిద్దుతున్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తూ ఇళ్ల నిర్మాణం వేగవంతానికి కృషి చేస్తున్నారు.

నిర్మాణ పనుల్లో అండదండగా..

ఇంటి నిర్మాణానికి రూ.1.8 లక్షలు ఆర్థిక సాయం మంజూరుకే పరిమితం కాకుండా ఇంటి నిర్మాణంలో వారికి అవసరమైన తోడ్పాటును ప్రభుత్వం అందిస్తోంది. లే అవుట్ల వద్ద నీటి వసతిని కల్పించింది. విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేశారు. డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులుగా ఉన్న లబ్ధిదారులకు అదనంగా రూ.35,000 రుణ సాయాన్ని అందిస్తోంది. సబ్సిడీపై ఐరెన్, సిమెంట్ అందించడంతో పాటు ఇసుకను ఉచితంగా అందజేస్తోంది. రవాణ భారం తగ్గించేందుకు లే అవుట్ల సమీపంలోనే ఇసుక, ఇటుకలు, సిమెంట్, ఐరెన్ స్టాకులను ఏర్పాటు చేస్తున్నారు.

వసతుల కల్పన

జగనన్న కాలనీల్లో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి తాగునీరు, రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, కమ్యూనిటీహాళ్లు తదితర వసతులు కల్పిస్తోంది. ఆయా పనులు పూర్తయితే కాలనీలోని ఒక్కో ఇల్లు రూ. 10 లక్షల నుంచి రూ. 12 లక్షలు విలువ చేస్తుందని అధికారులు అంటున్నారు. ఈ మేరకు పేద బతులకు భరోసానిస్తూ స్థిరాస్తి సమకూరుతోంది.



వేములపల్లి జగనన్న కాలనీలో శరవేగంగా జరుగుతున్న ఇళ్ల నిర్మాణం

ఇళ్ల నిర్మాణ ప్రగతి	మంజూరైన ఇళ్లు	పునాది దశ	వివిధ దశల్లో ఉన్నవి	పూర్తయినవి
మండపేట పట్టణం	2013	1223	272	308
మండపేట మండలం	4505	2118	238	995

మండపేట అర్బన్, రూరల్ పరిధిలో 1364 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉంది.

కల నెరవేరింది



ఇంటి స్థలం కోసం గతంలో ఎన్నోసార్లు అధికారులకు దరఖాస్తులు చేసుకున్న ఫలితం లేకపోయింది. వలంటీరే మా వద్దకు వచ్చి దరఖాస్తు తీసుకున్నారు. స్థలంతో పాటు ప్రభుత్వ సాయంతో సొంతింటి కలను నెరవేర్చుకున్నాం.

– సత్తి సాయిలక్ష్మి, లబ్ధిదారురాలు, అర్తమూరు

జిల్లాలో మొదటిస్థానంలో మండపేట



ఇళ్ల నిర్మాణంలో మండపేట జిల్లాలో మొదటిస్థానంలో ఉంది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగుల సహకారంతో పనుల వేగవంతానికి కృషిచేస్తున్నాం. కాలనీల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతుల కల్పన జరుగుతుంది.

– ఐ.రాజు, ఎంపీడీఓ, మండపేట

దాడి ఘటనలో ఒకరికి గాయాలు

మండపేట: స్నేహితుని పుట్టిన రోజు వేడుకలకు హాజరైన తనపై నలుగురు దాడి చేసినట్టు బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నీలపాల కాశీరామ్ సోమవారం రాత్రి పట్టణంలో స్నేహితుని జన్మదిన వేడుకలకు వెళ్లాడు. అక్కడికి వచ్చిన కత్తుల సాయినారాయణమూర్తి (హరిష్), కత్తుల వెంకటేష్ (హర్ష), చింతా కల్యాణ్, సుబ్బులతో వివాదం తలెత్తగా మిగిలిన స్నేహితులు సర్ది చెప్పారు. పెట్రోల్ బంకు వద్దకు వెళుతున్న తనపై నలుగురు కత్తితో దాడి చేసి గాయపర్చినట్టు కాశీరామ్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎం.అశోక్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులకు పరామర్శ

కపిలేశ్వరపురం: ఇంట్లో విలువైన బంగారం, వెండి ఆభరణాలు చోరీకి గురవడంతో బాధలో ఉన్న వారిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బుధవారం పరామర్శించారు. ఈనెల 7వ తేదీన హైదరాబాద్ వెళ్లన కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన గరగపాటి వెంకటరావు, సూర్యకుమారి దంపతులు ఈ నెల 17న ఇంటికి వచ్చారు. తాళాలు పగలగొట్టి బీరువాలోని ఆభరణాలను చోరీ చేశారు. ఘటనపై స్పందించిన ఎమ్మెల్సీ తోట బాధితులను పరామర్శించారు. డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్‌తో చర్చించి త్వరితగతిన బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ శీలం భాస్కరరావు, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కట్టా మురళి, నాయకులు అరదాని శ్రీదేవి, చింతా పెద్దకాపు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- మాచరలో గడప గడపకూ కార్యక్రమం



మాచర గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని మాచరలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట తనయుడు, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, సర్పంచ్ వాసంశెట్టి సునీత, పీఏసీఎస్ చైర్మన్ కర్రెడ్ల శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు వాసంశెట్టి విష్ణు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, సచివాలయ ఉద్యోగులతో కలసి గ్రామంలో పర్యటించారు. ఎమ్మెల్సీ తోటకు గ్రామ ప్రజలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ, సమస్యలను సావధానంగా ఆలకిస్తూ పర్యటన సాగింది. సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఎమ్మెల్సీ తోట ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అడపా బాబ్జి, అడపా శేషారావు, కప్పల శ్రీన, బడుగు ఏసు, మట్టారాజు, మేడిశెట్టి జగదీశ్, సర్పంచ్‌ల సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

రామచంద్రపురం రూరల్: ఆర్టీసీ ఉద్యోగులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని పేర్కొంటూ ఆయన చిత్రపటానికి రామచంద్రపురం డిపో ఆర్టీసీ ఉద్యోగులు డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం క్షీరాభిషేకం చేశారు. డీఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీఎం జగన్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, పీఆర్‌సీ అమలు చేయడం, హైయర్ పెన్షన్‌ను వర్తింపచేయడం, పదవీ విరమణ 62 ఏళ్లకు పెంచడంతో పాటు కరోనా సమయానికి కూడా జీతాలు ఇవ్వడం ద్వారా ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందం నింపారని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ డీవీఎస్ రాజు, గ్యారేజీ ఇన్‌చార్జి రవిబాబు, పడాల ప్రసాద్, టీవీ రమణ, పట్టాభి, డి.వర్మ, రామకృష్ణ, గన్నియ్య, సెక్యూరిటీ ప్రతాప్, అధిక సంఖ్యలో యూనియన్ నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆధారాలు ఉంటేనే తొలగించండి

రామచంద్రపురం: ఓటర్ల జాబితాలో ఆధారాలు ఉంటేనే తొలగించాలని ఆర్డీవో పి.సింధూ సుబ్రహ్మణ్యం బూత్‌లెవెల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని బూత్ లెవెల్ అధికారులు సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఇంటింటికీ సర్వే నిర్వహించి ఒక డోర్ నంబర్‌లో అధిక ఓట్లు ఉన్నచో వాటిని నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. డోర్ నంబర్‌లో తప్పులు లేకుండా సరిచేయాలని, మరణించిన వ్యక్తులు ఓటు విచారణ చేసి పూర్తి ఆధారాలుంటేనే తొలగించాలని ఆదేశించారు. తహసీల్దార్ తేజేశ్వరరావు బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణం ప్రారంభించడంతో ముస్లింల హర్షం

రామచంద్రపురం రూరల్: ఏళ్లనాటి సమస్యగా ఉన్న డ్రైనేజీ సమస్య గడప గడపకూ మన ప్రభుత్వంతో పరిష్కారమయిందని ముస్లిం నేతలు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని ద్రాక్షారామలో ముస్లిం కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులు బుధవారం ప్రారంభించారు. ముస్లిం మత గురువు మౌలానా అస్కరీ హుస్సేన్ ప్రార్థనలు చేసి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ మండల కన్వీనర్ అలీ హుస్సేన్, మండల కోఆప్షన్ మెంబర్ షేక్ అహ్మద్ అలీషాలు మాట్లాడుతూ 20 ఏళ్లుగా ముస్లిం కాలనీలో డ్రైనేజీలు లేక చాలా ఇబ్బందులు పడేవారని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ డ్రైనేజీల నిర్మాణానికి హామీ ఇవ్వడంతో పాటు రూ.20 లక్షలు నిధులు మంజూరు చేశారన్నారు. దీనితో పనులు ప్రారంభించడం ఆనందంగా ఉందని మంత్రి వేణుకు, సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు షేక్ మహబూబ్ ఉన్నీసా, వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

పీఎంపీ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నుకున్న కార్యవర్గ సభ్యులు

కె.గంగవరం: మండల పీఎంపీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం కె.గంగవరంలో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు తోలేటి ప్రభాకరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు సమక్షంలో జరిగిన ఈ ఎన్నికలో సంఘం మండల అధ్యక్షుడిగా మేడిశెట్టి రామకృష్ణ, కార్యదర్శిగా పున్నం రాము (అముజూరు), కోశాధికారిగా సూదికొండ సుబ్రహ్మణ్యంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను ఇతర సభ్యులు, రాష్ట్ర నాయకులు శాలువాలు, పూలదండలతో సత్కరించారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ అసోసియేషన్‌లోని సభ్యుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ బళ్లా శ్రీనివాసరావు, కేఎస్ ప్రసాద్, సూరంపూడి వీరభద్రరావు, కొప్పిశెట్టి వెంకటేశ్వర్లు, మట్టా వీరబాబు, గుబ్బల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల పీఎంపీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. మండలంలోని అన్నాయిపేటలో క్రీస్తు సంఘం భవనంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోలేటి ప్రభాకరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా కన్వీనర్ గంగుమళ్ల రాంబాబుల నేతృత్వంలో జరిగిన ఎన్నికలో అసోసియేషన్ అధ్యక్షుడిగా కొప్పిశెట్టి వెంకటేశ్వర్లు నాలుగోసారి అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. కార్యదర్శిగా మట్టా వీరబాబు, కోశాధికారిగా గుబ్బల సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మొహర్రం నెల ప్రారంభం

రామచంద్రపురం రూరల్: చంద్రవంక దర్శనంతో ద్రాక్షారామలో ముస్లిం భక్తులు మొహర్రం సంతాప దినాలను బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ద్రాక్షారామ పరిసరాలలోని 20 పంజాలను ధర్మకర్తలు సిద్ధం చేశారు. ముస్లింలు అధికంగా నివసించే ద్రాక్షారామలోని పలు పంజాల్లో బుధవారం రాత్రి నెలవంకను చూసి మొహర్రం సంతాప దినాలుగా పరిగణించి ప్రారంభించారు.



కదల్లేని పరిస్థితుల్లో..



జల్లి వెంకాయమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రూనీ్స

వృద్ధాప్యం కారణంగా కదలలేని పరిస్థితుల్లో ఉన్న నాకు వలంటీర్ ఉదయాన్నే పింఛన్ తీసుకువచ్చి ఇస్తుంది. గతంలో ఫింఛన్ కోసం ఎదురుచూపులు చూడాల్సి వచ్చేది. కాని వలంటీర్ ఝాన్సీ మా ఇంటికి వచ్చి ఇస్తుంది. 80 సంవత్సరాల వయస్సులో నేను ఎక్కడికి వెళ్లలేను. మా ఇంటి కాలనీకి చెందిన వలంటీర్ ఎంతో చక్కగా పని చేస్తుంది. ప్రతి నెలా ఉదయాన్నే వచ్చి తలుపుతట్టి పింఛన్ ఇస్తుంది. నాకు చాలా ఆనందంగా ఉంది.

– రామచంద్రపురం

రావడానికి భయపడే రోజుల్లో..



కరోనా వచ్చి కాలనీ అంతా భయంతో నిండిపోయిన రోజుల్లో వలంటీర్లు ఇంటికి వచ్చి వేలిముద్ర వేయించుకుని పింఛన్ అందించేవారు. ఆరోగ్య సిబ్బందితో కలసి ఆరోగ్య పరీక్షలు చేసి సకాలంలో మందులు అందించేవారు. ప్రజలు వలంటీర్ల సేవలతో ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలను అందుకుంటూ ఆనందంగా ఉంటున్నారు. సేవాభావంతో వలంటీర్లు చేస్తున్న సేవలకు ప్రతి ఒక్కరూ వందనం చెబుతున్నారు.

– మండపల్లి చిట్టిబాబు, స్టీల్‌విల్‌పేట, రామచంద్రపురం

మానవత్వం మురిసేలా..



మండపేటలో భోజనం వడ్డిస్తున్న వెన్నేటి స్వాతికుమారి

కపిలేశ్వరపురం: వలంటీర్లు నెలనెలా పింఛను, సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించడమే కాదు వ్యక్తిగతంగా మానవత్వాన్ని కూడా చాటుకుంటున్నారు. మండలంలోని తాతపూడి గ్రామానికి చెందిన వలంటీర్లు వెన్నేటి స్వాతికుమారి, ఈదర దివ్య మాధురి 2019లో తాము అందుకున్న తొలి గౌరవ వేతనాన్ని మండపేటలోని అంధుల పాఠశాలలో అంధులకు భోజనం పెట్టి, విరాళంగా అందజేశారు. అంధ విద్యార్థులపై మానవత్వాన్ని చాటుకున్నారు. ఈదర దివ్య మాధురి తన మొదటి రెండు నెలల గౌరవ వేతనాన్ని అంధుల పాఠశాలకు విరాళంగా అందజేశారు. వెన్నేటి స్వాతికుమారి తన రెండు నెలల జీతంతో అంధుల పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. సేవా దృక్పథంతో ప్రారంభించిన వలంటీర్ వ్యవస్థ తమకు బాధ్యతను పెంచిందని. అదే ఒరవడితో తాము తోచిన సాయం చేశామని వారు చెప్పారు.

ఆగుతూ.. కురుస్తూ

- ఉపరితల ఆవర్తనంతో వర్షాలు



వర్షంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

రాయవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో గత రెండు రోజులుగా ముసురు వాతావరణం నెలకొంది. అల్పపీడన ప్రభావంతో పాటుగా, నైరుతి రుతు పవనాలు బలపడడంతో తేలికపాటి జల్లుల నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం నుంచి వాతావరణంలో మార్పులు సంభవించడంతో వాతావరణం చల్లబడి, వర్షాలు పడుతుండడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వర్షాలు కురుస్తున్నా కూలీలు వరినాట్లు వేస్తున్నారు. ఖరీఫ్ వ్యవసాయ పనులకు వర్షాలు మేలు చేస్తున్నాయని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ తెలిపారు. వర్షాలకు ఇటుకల బట్టీల్లో పనులు నిలిచాయి. సాధారణంగా బట్టీల్లో వర్షాలు తగ్గిన తర్వాత నాలుగైదు రోజుల వరకు పనులు ప్రారంభించరు. వర్షాలతో ఇటుకలు తీయడానికి కుదరక పోవడంతో కూలీలకు పనులు ఆడవు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- యువనేత తోట పృథ్వీరాజ్
- అర్తమూరులో జగనన్న సురక్ష కార్యక్రమం

మండపేట: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని యువనేత తోట పృథ్వీరాజ్ పేర్కొన్నారు. అర్తమూరు–1వ సచివాలయం పరిధిలో సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి పృథ్వీరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి దంపతులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో గ్రామాభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించారు. పృథ్వీరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందేందుకు అవసరమైన ధృవీకరణ పత్రాల కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా ఒక్క రోజులోనే జగనన్న సురక్ష శిబిరాలు వద్ద అందిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు పృథ్వీరాజ్, సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి దంపతులు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీడీఓ ఐ.రాజు, పార్టీ యువజన విభాగం నాయకులు చిర్ల జయరామ్‌రెడ్డి, గొలుగూరి సందీప్‌రెడ్డి, ఈఓ అనిల్‌కుమార్, పార్టీ నాయకులు కొవ్వూరి వెంకటరెడ్డి, తేతలి భూపతిరెడ్డి, కొవ్వూరి నాగిరెడ్డి, నల్లమిల్లి రామచంద్రారెడ్డి, తాడి రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అర్తమూరులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పృథ్వీరాజ్, సర్పంచ్ అన్నపూర్ణ

సేవే లక్ష్యంగా ప్రభుత్వ వ్యవస్థలు : ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ వ్యవస్థలు సేవే లక్ష్యంగా పని చేస్తున్నాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మాచరలో బుధవారం సర్పంచ్ వాసంశెట్టి సునీత అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, పీఏసీఎస్ చైర్మన్ కర్రెడ్ల శ్రీను, తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డిలతో కలిసి లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి గెద్దం చినబాబు, సచివాలయ కన్వీనర్లు, రాయుడు జగపడి, సుందరపల్లి పుష్ప, పట్నాల పట్టాభిరామయ్య, గుబ్బల



కూళ్లలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంపీపీ నాగమణి

ప్రకాష్, అడపా సత్తిరాజు, గృహ సారథులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

కె.గంగవరం: గ్రామీణ ప్రాంత ప్రజలు జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి అన్నారు. మండలంలోని కూళ్ల గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. గ్రామ సభలో వారు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. 11 రకాల ధ్రువపత్రాలు ఎటువంటి ఖర్చు లేకుండా ఉచితంగా పొందొచ్చన్నారు. గతంలో కావాల్సిన ధ్రువపత్రాల కోసం సచివాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదని ఒక్క రోజులోనే సంబంధిత పత్రాలు ఉచితంగా అందుకోవచ్చన్నారు. అనంతరం లబ్ధిదారులకు పత్రాలను పంపిణీ చేశారు. ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, మాజీ మండల కన్వీనర్ ఓబులనేని రాజ్‌కుమార్, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, సర్పంచ్ నాగేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాచర సురక్ష గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

రాయవరం: మండలంలోని సోమేశ్వరం–2, మాచవరం–1 గ్రామ సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష శిబిరాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. పౌరులకు పౌర సేవల్లో భాగంగా వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందించేందుకు జగనన్న సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే జగనన్న సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

వృథాగా పోతున్న తాగునీరు

కాజులూరు: శలపాక శివారు మొగలిపాలెంలో పైపులైన్లు లీకై తాగునీరు వృథాగా పోతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 60 కుటుంబాలు కలిగిన శలపాక శివారు మొగలిపాలెంకు సరిహద్దులోని బందనపూడి శివారు మొగలిపాలెంలోని వాటర్ ట్యాంకు నుంచి ప్రతిరోజు కుళాయిలకు తాగునీరు సరఫరా జరుగుతుంది. అయితే ఇటీవల పలు చోట్ల పైపులైను లీకై తాగునీరు పంట కాలువలోనికి వృథాగా పోతుంది. దీంతో కుళాయిలకు చుక్కనీరు కూడా రావటం లేదు. దీంతో గ్రామ వలంటీరు ద్వారా సచివాలయ సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ గ్రామం ప్రధాన గ్రామానికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ఎటువంటి సమస్యలు వచ్చిన సచివాలయ సిబ్బంది రావటం లేదని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని బాధిత మహిళలు, స్థానికులు కోరుతున్నారు.